సాక్షి విశాఖపట్నం

శుక్రవారం | 2 | జూన్ | 2023



'జూనియర్' సందడి..!

ఉమ్మడి విశాఖ జిల్లాలో జూనియర్ కాలేజీలు గురువారం తెరుచుకున్నాయి. విద్యార్థులు కాలేజీల బాట పట్టారు. 8లో



రివెంజ్ మర్డర్

ఉషోదయ కూడలిలో రౌడీషీటర్ దారుణ హత్యకు గురయ్యాడు. నిందితుడు ఎర్రయ్యను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. 8లో



రేపు తాగునీటికి అంతరాయం

జీవీఎంసీ పరిధిలో పలు ప్రాంతాల్లో ఈ నెల 3న తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని అధికారులు తెలిపారు. 8లో

న్యూస్‌రీల్

శ్రీవారి సన్నిధిలో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి



శ్రీవారిని దర్శించుకున్న జస్టిస్ శేషసాయి

కొమ్మాది/డాబాగార్డెన్స్: రుషికొండలో కొలువైన మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వర స్వామిని గురువారం హైకోర్టు ప్రధాన న్యాయ మూర్తి జస్టిస్ ఎ.వి.శేషసాయి దర్శించుకున్నారు. అంతరాలయంలో శ్రీవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ సూపరింటెండెంట్ వెంకటరమణ, ఇన్‌స్పెక్టర్ సూర్యనారాయణ రాజు ఆయనకు స్వామి ప్రసాదం అందజేశారు. బురుజుపేటలో కొలువై ఉన్న కనకమహాలక్ష్మిని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎ.వి.శేషసాయి, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ.గిరిధర్, ప్రోటోకాల్ జిల్లా సీనియర్ న్యాయమూర్తి వై.యుగంధర్, న్యాయమూర్తి శ్రీధర్ దర్శించుకున్నారు. ఈవో కె.శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదులకు తక్షణమే పరిష్కారం



కాలర్‌తో మాట్లాడుతున్న సీపీ త్రివిక్రమ్ వర్మ

దొండపర్తి : డయల్ యువర్ సీపీ కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులను సత్వరమే చట్టపరంగా పరిష్కరించాలని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ సి.ఎం.త్రివిక్రమ్‌వర్మ అధికారులను ఆదేశించారు. సోమవారం నిర్వహించిన డయల్ యువర్ సీపీ కార్యక్రమానికి ఎనిమిది మంది ఫిర్యాదులు చేశారు. సీపీ ప్రతి ఒక్క కాలర్‌తో మాట్లాడుతూ వారి సమస్యలను తెలుసుకుంటూ.. సంబంధిత అధికారులతో తక్షణమే వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. డీసీపీ-1 విద్యాసాగర్ నాయుడు, డీసీపీ-2 కె.ఆనందరెడ్డి, డీసీపీ(క్రైం) జి.నాగన్న, ఏడీసీపీ(క్రైం) డి.గంగాధరం, ఏడీసీపీ(ఎస్‌బీ) ఇ.నాగేంద్రుడు పాల్గొన్నారు.

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రత్యేక డ్రైవ్



పోస్టర్ ఆవిష్కరిస్తున్న డీఆర్‌వో శ్రీనివాసమూర్తి

మహారాణిపేట: బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన కోసం కార్మిక శాఖ ప్రత్యేక డ్రైవ్‌కు శ్రీకారం చుట్టింది. ఈ మేరకు కార్మిక శాఖ తయారు చేసిన పోస్టర్, వాహనాన్ని గురువారం జిల్లా రెవెన్యూ అధికారి ఎస్.శ్రీనివాసమూర్తి, జిల్లా న్యాయ సేవ సమితి సెక్రటరీ, ఉన్నత సివిల్ జడ్జి శేషమ్మ ప్రారంభించారు. తనిఖీల్లో పాల్గొననున్న సిబ్బందికి పలు మార్గదర్శక సూచనలు, సూత్రాలను శేషమ్మ తెలియజేశారు. బాల కార్మికులను గుర్తించిన తర్వాత యజమానులపై విచారణ, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ నెల 30వ తేదీ వరకు ఈ తనిఖీలు కొనసాగుతాయని కార్మిక శాఖ ఉప కమిషనర్ ఎం.సునీత తెలిపారు. ఈ కార్యక్రమంలో పలు వుమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ సంస్థలు, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్, ప్రాజెక్టర్ డైరెక్టర్, ఎన్‌సీఎల్‌సీ, డీఎంహెచ్‌వో అధికారులు, ఎన్జీవోలు, జిల్లా టాస్క్‌ఫోర్స్ సిబ్బంది పాల్గొన్నారు.

వీర్ కశ్యప్‌కు నేవీ సత్కారం



వీర్ కశ్యప్‌ను సన్మానిస్తున్న నౌకాదళాధిపతి అడ్మిరల్ ఆర్.హరికుమార్

దొండపర్తి(విశాఖ దక్షిణ): ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్ అందుకున్న విశాఖ నేవీ స్కూల్ విద్యార్థి, నేవీ కమాండర్ కశ్యప్ కుమారుడు మాస్టర్ వీర్ కశ్యప్‌ను భారత నావికాదళపతి అడ్మిరల్ ఆర్.హరికుమార్ గురువారం విశాఖపట్నంలో సత్కరించారు. 2020లో 7వ తరగతిలో ఉన్న వీర్ కశ్యప్ కోవిడ్‌పై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు 'కరోనా యుగ' పేరుతో బోర్డ్ గేమ్‌ను రూపొందించాడు. ఈ గేమ్.. మాస్క్ ధరించడం, భౌతిక దూరం పాటించడం వంటి జాగ్రత్తలపై అవగాహన కల్పించడంతో పాటు వినోదాన్ని కూడా అందించింది. దీంతో వీర్ కశ్యప్‌కు ప్రధానమంత్రి రాష్ట్రీయ బాలపురస్కార్-2021 ప్రదానం చేశారు. ఈ గేమ్ యువ ప్రతిభకు నిదర్శనమని హరికుమార్ ప్రశంసించారు.


వర్ష బేస్ గెట్ రెడీ

- రాంబిల్లి వద్ద సాగరతీర అంతర్భాగంలో సీక్రెట్ న్యూక్లియర్ సబ్‌మెరైన్ బేస్ నిర్మాణం
- ఈ ఏడాది చివరి నాటికి అందుబాటులోకి వచ్చే అవకాశం
- ఒకే సారి 12 సబ్‌మెరైన్లు ఉంచేలా ఏర్పాటు

సాక్షి, విశాఖపట్నం: దేశానికి వ్యూహాత్మక రక్షణ ప్రాంతంగా.. సహజ సిద్ధమైన భౌగోళిక రక్షణతో పాటు శత్రుదేశాలకు సుదూరంగా ఉండటం తూర్పు నౌకాదళం ప్రత్యేకత. పెరుగుతున్న నౌకాదళ సంపత్తికి అనుగుణంగా.. విభిన్న స్థావరాలను ఏర్పాటు చేసుకున్న ఈఎన్‌సీ.. ప్రత్యామ్నాయ బేస్‌గా అతి రహస్య స్థావరాన్ని సిద్ధం చేసుకుంటోంది. అత్యంత శక్తిమంతమైన అణు జలాంతర్గాములను సాగర గర్భంలోనే ఉంచేలా..విశాఖ శివారు రాంబిల్లిలో నిర్మిస్తున్న ఐఎన్ఎస్ వర్ష ఈ ఏడాది చివరి నాటికి అందుబాటులోకి రానుంది.

ఈఎన్‌సీకి చెందిన స్థావరాలు మొత్తం 15 ఉండగా ఇందులో ఏడు నేవల్ బేస్‌లు విశాఖలోనే ఉన్నాయి. దీనికి తోడుగా రాంబిల్లిలో కొత్త నేవల్ బేస్ ఐఎన్ఎస్ వర్ష నిర్మితమవుతోంది. ఇది మిగిలిన స్థావరాలతో పోలిస్తే పూర్తిగా భిన్నమైనది. వర్ష వంటి భూగర్భ నౌకా స్థావరాలు కొత్తవి కాదు. రష్యా, చైనా.. తన జలాంతర్గాములను ఆపరేట్ చేయడానికి ఈ తరహా అండర్ గ్రౌండ్ స్థావరాలను నిర్మించుకున్నారు. అదేవిధంగా.. భారత నౌకాదళానికి కూడా రహస్య స్థావరం ఉండాలనే ఉద్దేశంతో ఐఎన్ఎస్ వర్షను నిర్మిస్తున్నారు. తూర్పు నౌకాదళ ప్రధాన కేంద్రానికి 50 కి.మీ దూరంలో ఉన్న రాంబిల్లిలో దీన్ని నిర్మిస్తున్నారు. మొత్తం 670 హెక్టార్ల విస్తీర్ణంలో టన్నెల్స్ రూపంలో ఇది సిద్ధమవుతోంది.

ప్రస్తుతం ఈఎన్‌సీ ప్రధాన కేంద్రంలోనే యుద్ధ నౌకలు, సబ్‌మెరైన్లను ఉంచుతున్నారు. విశాఖపట్నం పోర్టు కూడా సమీపంలో ఉండటంతో కార్గో నౌకలు, కంటైనర్ నౌకలతో నిరంతరం రద్దీగా ఉంటోంది. భద్రత దృష్ట్యా మరో రహస్య స్థావరం కోసం వర్షను నిర్మిస్తున్నారు. అణు జలాంతర్గాములు దేశ నౌకాదళంలో అత్యంత కీలకమైనవి. వీటి రాకపోకలను అత్యంత గోప్యంగా ఉంచడం చాలా ముఖ్యం. ఐఎన్ఎస్ అరిహంత్ వంటి న్యూక్లియర్ సబ్‌మెరైన్లు నెలల తరబడి సముద్ర గర్భంలో విధి నిర్వహణలో ఉంటాయి. 200 మీటర్ల లోతులో నిశ్శబ్దంగా కదులుతున్నట్లు గుర్తించడం, ట్రాక్ చేయడం దాదాపు అసాధ్యం. అయితే ఇవి పోర్టు సమీపంలో లంగరు వేసినప్పుడు శత్రు గూఢచారి శాటిలైట్స్ సులభంగా గుర్తించగలవు. వీటి సమాచార గోప్యత కోసం ఐఎన్ఎస్ వర్ష ఉపయోగపడుతుంది.



రాంబిల్లి వద్ద ఐఎన్ఎస్ వర్ష నేవల్ బేస్ నిర్మితమవుతున్న ప్రాంతం

దేశ రక్షణకు కీలక స్థావరం

ఐఎన్ఎస్ వర్షలో ఐదు టన్నెల్స్ ఏర్పాటు చేస్తున్నారు. ఈ సొరంగాల ద్వారా సబ్‌మెరైన్లు స్థావరంలోకి రాకపోకలు సాగిస్తుంటాయి. కాబట్టి జలాంతర్గాములు ఉపరితలంపైకి రావాల్సిన అవసరం లేదు. అందువల్ల శత్రువులు వీటి జాడని కనిపెట్టలేరు. వర్ష బేస్‌లో సిబ్బంది విశ్రాంతి సౌకర్యాలు, మరమ్మతులు, నిర్వహణకు అనువుగా భవనాలు నిర్మించారు. మొత్తం 12 న్యూక్లియర్ సబ్‌మెరైన్లు ఒకే కాలంలో అండర్ గ్రౌండ్‌లో ఉండేలా ఏర్పాట్లు చేశారు. అంతే కాకుండా డీజిల్, ఎలక్ట్రిక్ సబ్‌మెరైన్లను కూడా ఇక్కడి నుంచే ఆపరేట్ చేయగల సామర్థ్యం ఉంది. శత్రుమూకలు అణు దాడి చేసినా.. వాటి నుంచి సురక్షితంగా ఉండేలా ఐఎన్ఎస్ వర్ష నిర్మాణం జరుగుతోంది. సబ్‌మెరైన్లలో అణు రియాక్టర్ల నిర్మాణం, అమర్చడం కూడా ఇక్కడ జరగనుంది. నీటి అడుగున స్థావరం వద్ద మిస్సైల్ టెక్నికల్ పొజిషన్స్ అనే ఆయుధ నిల్వ సౌకర్యం కూడా ఉంది. మొత్తంగా దేశ రక్షణకు కీలక స్థావరంగా ఐఎన్ఎస్ వర్ష సన్నద్ధమవుతోంది. కోవిడ్ కారణంగా పనులు ఆలస్యమయ్యాయని.. ఈ ఏడాది చివరి నాటికి ఇది అందుబాటులోకి వచ్చే అవకాశాలున్నట్లు భారత నౌకాదళాధిపతి అడ్మిరల్ హరికుమార్ స్పష్టం చేశారు.



అండర్ గ్రౌండ్‌లో సబ్‌మెరైన్లు ఉంటాయిలా..

అత్యాధునికంగా నేవల్ బేస్



రాంబిల్లిలో నిర్మితమవుతున్న నేవల్ ఆల్టర్నేటివ్ ఆపరేషనల్ బేస్(ఎన్ఏవోబీ) పనులు చురుగ్గా సాగుతున్నాయి. వీలైనంత త్వరగా దీన్ని అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నాం. తూర్పు తీరంలో ఆరు లక్షల చ.కి.మీ పరిధిలో ఎక్స్‌క్లూజివ్ ఎకనమిక్ జోన్‌తో పాటు మేజర్ పోర్టులున్నాయి. సముద్ర వాణిజ్యానికి తూర్పు తీరం ప్రధాన కేంద్రంగా మారడంతో వాణిజ్య నౌకల రక్షణ బాధ్యత కూడా తూర్పు నౌకాదళమే చూస్తోంది. దీంతో పాటు డీఆర్‌డీవో కార్యకలాపాలకు కూడా విశాఖ వేదికగా మారింది. పలు క్షిపణులు తయారు చేసే ఎన్ఎస్‌టీఎల్ కూడా ఇక్కడే ఉంది. ఎప్పటికప్పుడు నౌకా సంపత్తిని పెంచుకుంటూ శత్రుదుర్భేద్యంగా మారుతున్న నేపథ్యంలో ఈ అత్యాధునిక నేవల్ బేస్ సిద్ధం చేస్తున్నాం. అరిహంత్ క్లాస్ సబ్‌మెరైన్లతో పాటు ఎస్ 5, న్యూక్లియర్ ఎటాక్ సబ్‌మెరైన్లను కూడా ఇక్కడ ఉంచేలా నిర్మిస్తున్నాం.

– అడ్మిరల్ హరికుమార్, భారత నౌకాదళాధిపతి

నేడు మెగా జాబ్‌మేళా

కంచరపాలెం: స్థానిక జిల్లా ఉపాధి కార్యాలయం నేషనల్ కెరియర్ సర్వీస్ సెంటర్‌లో శుక్రవారం జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారులు కె.సుధ(టెక్నికల్), సిహెచ్ సుబ్బిరెడ్డి(క్లరికల్) ఒక ప్రకటనలో తెలిపారు. హోబిల్ బిలోస్ ఎంఎస్ఎన్ లేబొరేటరీ హైదరాబాద్, హెటిరో, డెక్కన్ ఫైన్ కెమికల్స్ తుని, మెడ్‌ప్లస్ ఫార్మా విశాఖ, అనకాపల్లి, తమ్మినా సాఫ్ట్‌వేర్ సొల్యూషన్, టీజేఎల్ ఎన్‌డీటీ టెక్నాలజీస్, పలు ప్రైవేటు లిమిటెడ్ కంపెనీల్లో 560 ఖాళీల భర్తీకి ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు. ఆపరేటర్, కస్టమర్ ఎగ్జిక్యూటివ్, కెమిస్ట్, క్యాషియర్, జూనియర్ క్యాడ్ ఇంజనీర్, వేర్‌హౌస్ అసోసియేట్స్, జీఐఎస్ ఇంజనీర్ కేడ్, టెలికాలింగ్, అకౌంటెంట్, సేల్స్ ఎగ్జిక్యూటివ్, ఫైనాన్స్ ఎగ్జిక్యూటివ్, కేర్ టేకర్స్, ఏఎస్ఎం, ప్లానింగ్ అధికారి, ఐటీ రిక్రూటర్, ట్రైనీలు, మేనేజర్ల ఉద్యోగాలకు ఎస్ఎస్‌సీ, ఏదైనా డిగ్రీ, పోస్ట్ గ్రాడ్యుయేషన్స్, ఐటీఐ, డిప్లమా, బీటెక్ ఎంబీఏలో అర్హత సాధించి ఉండాలన్నారు. 18-30 సంవత్సరాల వయసు కలిగిన పురుష, మహిళా అభ్యర్థులు అర్హులన్నారు. ఆయా ఉద్యోగం బట్టి జీతం నెలకు రూ.12,000 నుంచి రూ.33,000ల వరకు ఉంటుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ncr.gov.in వెబ్‌సైట్‌లో పేర్లు రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు.

నేవీ, ఎస్ఎస్‌సీ ఉద్యోగాలకు శిక్షణ

డాబాగార్డెన్స్: అల్లూరి స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో ఇండియన్ నేవీ చార్జ్‌మెన్, ఎస్ఎస్‌సీ గ్రూప్-సి ఉద్యోగాలకు కోచింగ్ ప్రారంభించనున్నట్లు స్టడీ సర్కిల్ నిర్వాహకుడు కె.అభిమన్యు ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 5 నుంచి డాబాగార్డెన్స్ అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం వేదికగా తరగతులు ప్రారంభంకానున్నాయని తెలిపారు. అర్థమెటిక్, రీజనింగ్, ఇంగ్లిష్, జీకేతో పాటు 24 ట్రేడ్‌లకు సంబంధించి అనుభవజ్ఞులైన నిపుణులతో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తామన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు http://bit.ly/3G1NgEW లింక్ ద్వారా వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 8008412798 నంబరులో సంప్రదించవచ్చు.

అన్నదాతకు అండగా..

- జిల్లాలో రైతు భరోసా లబ్ధిదారులు - 27,955 మంది
- పంపిణీ చేసిన నగదు - రూ.20.97 కోట్లు



సమావేశానికి హాజరైన రైతులు



రైతులకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, కలెక్టర్ మల్లికార్జున

పద్మనాభం : వైఎస్సార్ రైతు భరోసా అన్నదాతకు అండగా నిలుస్తుందని కలెక్టర్ ఎ.మల్లికార్జున అన్నారు. మండలంలోని పాండ్రంగిలో గురువారం ఐదో ఏడాది మొదట విడత రైతు భరోసా, పీఎం కిసాన్ పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావుతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో 27,955 మంది రైతులకు రూ.20.97 కోట్లు లబ్ధి చేకూరుతుందన్నారు. ఒక్కొక్క రైతుకు రూ.7,500 చొప్పున బ్యాంకు ఖతాల్లో జమ అవుతుందన్నారు. అర్హులై ఉండి రైతు భరోసా అందనట్లయితే స్థానిక సచివాలయాల్లో సంప్రదించాలన్నారు. 2023 మార్చి, ఏప్రిల్ నెలల్లో కురిసిన అకాల వర్షాలకు పంట నష్టపోయిన 125 మంది రైతులకు పెట్టుబడి రాయితీ కింద రూ.3.26 లక్షలు ప్రభుత్వం మంజూరు చేసిందని తెలిపారు.పాండ్రంగి సమీపాన గోస్తని నదిలో వంతెన నిర్మాణానికి త్వరలో టెండర్ వేసి పనులు చేపడతామన్నారు. మండల కేంద్రంలో విత్తన శుద్ధి కేంద్రం నిర్మాణ పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. పాండ్రంగిలో అల్లూరి సీతారామరాజు మ్యూజియం నిర్మాణ పనులు వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను, సైడు కాలువల నిర్మాణానికి నిధులు ఎంత అవసరమో క్షేత్ర స్థాయిలో పరిశీలించి తనకు తెలియజేయాలని ఎంపీడీవో ఎం.విజయ్ కుమార్‌ను ఆదేశించారు. ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ సీఎం వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి రైతు పక్షపాతి అన్నారు. చెప్పిన సమయం కంటే ముందుగానే రైతు ఖాతాల్లో డబ్బులు జమ చేస్తున్నట్టు పేర్కొన్నారు. గిట్టుబాటు ధర కల్పించడంతో పాటు రైతులు పండించిన పంటలను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందన్నారు. సీఎం ప్రత్యక్ష ప్రసారం అనంతరం జిల్లాలో లబ్ధిపొందిన రైతులకు మెగా చెక్కును అందజేశారు. ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావును పాండ్రంగి గ్రామంలో నుంచి సభావేదిక వద్దకు ఎండ్ల బండిపై ఊరేగింపుగా తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా వ్యవసాయశాఖ ఏర్పాటు చేసిన 'చిరు ధాన్యాలు, అపరాలు రోజు ఆహారంగా తీసుకుందాం-మన ఆరోగ్యాన్ని కాపాడుకుందాం' స్టాల్ అందరిని ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఆర్డీవో భాస్కరరెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి అప్పలస్వామి, డీసీఎంఎస్ చైర్మన్ పల్లా చినతల్లి, ఎంపీపీలు కంటుబోతు రాంబాబు, మజ్జి శారద ప్రియాంక, జెడ్పీటీసీలు సుంకర గిరిబాబు, గాడు వెంకటప్పడు, భీమునిపట్నం మార్కెట్ చైర్మన్ యలమంచలి సూర్యనారాయణ, వైస్ చైర్మన్ బోని అప్పలనాయుడు, పాండ్రంగి సర్పంచ్ పల్లి ఝాన్సి పాల్గొన్నారు.

సింహగిరిపై నృసింహ జయంతి రేపు

- సాయంత్రం 4 గంటల తర్వాత దర్శనాల బంద్
- 4న సుప్రభాతం, ఆరాధన సేవల టికెట్ల రద్దు

సింహాచలం: సింహగిరిపై శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో శనివారం శ్రీనృసింహ జయంతిని ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ ఏఈవో శ్రీనివాసరావు తెలిపారు. సాయంత్రం 4 గంటల నుంచి నృసింహ జయంతి పూజలు జరుగుతాయని, అప్పటి నుంచి భక్తులకు అప్పన్న దర్శనం ఉండదన్నారు. తిరిగి 4వ తేదీ ఉదయం 7 గంటల నుంచి దర్శనాలు లభిస్తాయని తెలిపారు. 3న సాయంత్రం శ్రీకృష్ణాపురంలోని గోశాలలో ఉన్న నృసింహుడి విగ్రహం చెంతన కూడా నృసింహ జయంతి పూజలు నిర్వహిస్తామన్నారు. 4న జ్యేష్ఠ పౌర్ణమి సందర్భంగా స్వామికి మూడో విడత చందనం సమర్పణ చేస్తామన్నారు. 4న ఉదయం సుప్రభాతం, ఆరాధన సేవల టికెట్లను రద్దు చేసినట్టు తెలిపారు.

తొలిరోజు 73.29 శాతం పింఛన్ల పంపిణీ



ఆరిలోవలో దారపురెడ్డి సీతమ్మకు వితంతు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ సాయి



అమర్‌నగర్‌లో తాటిపూడి బంగారమ్మకు వృద్ధాప్య పింఛన్ అందజేస్తున్న వలంటీర్ మానస

మహారాణిపేట: జిల్లాలో తొలి రోజు పింఛన్ పంపిణీ ప్రశాంతంగా ముగిసింది. జిల్లాలో 1,58,000 మందికి వివిధ రకాల సామాజిక భద్రత పింఛన్లు ఉన్నాయి. వీరి కోసం ప్రభుత్వం రూ.44.59 కోట్లు కేటాయించింది. తుది సమాచారం ప్రకారం జిల్లాలో 1.15 లక్షల మంది(73.29 శాతం)కి వలంటీర్లు పింఛన్ అందజేశారు. గ్రామీణ ప్రాంతాల్లో డీఆర్‌డీఏ, నగర పరిధిలో జీవీఎంసీ ఆధ్వర్యంలో గురువారం తెల్లవారుజాము నుంచే పింఛన్ల పంపిణీ ప్రారంభమైంది. బయోమెట్రిక్ గుర్తింపు ద్వారానే లబ్ధిదారులకు వలంటీర్లు పింఛన్ సొమ్ము అందించారు. బ్యాంకుల నుంచి సకాలంలో సొమ్ము రాకపోవడం వల్ల పంపిణీ శాతం తగ్గినట్టు తెలుస్తోంది. ఈ నెల 5వ తేదీ వరకు పింఛన్ల పంపిణీ చేస్తామని డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ శోభారాణి తెలిపారు.

టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలకు సర్వం సిద్ధం

విశాఖ విద్య: పదో తరగతి సప్లిమెంటరీ(అడ్వాన్స్) పరీక్షలకు జిల్లా విద్యాశాఖాధికారులు సర్వం సిద్ధం చేశారు. శుక్రవారం నుంచి ఉదయం 9.30 – మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్షలు జరగనున్నాయి. జిల్లాలో 5,981 మంది విద్యార్థులు హాజరు కానున్నారు. వీరి కోసం 24 కేంద్రాలను ఏర్పాటు చేశారు. హాల్ టికెట్‌తో విద్యార్థులు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా పరీక్ష కేంద్రాల వరకు చేరుకోవచ్చు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తున్నారు. పరీక్షలు ప్రశాంతంగా ముగిసేలా జిల్లా పరిశీలకురాలు విద్యాశాఖ ఆర్జేడీ ఎం.జ్యోతికుమారి అధికారులకు దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వ పరీక్షల జిల్లా అసిస్టెంట్ కమిషనర్ మురళీమోహన్ ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు.

విద్యాశాఖలో బదిలీలు

విశాఖ విద్య: ఉమ్మడి విశాఖ జిల్లాలోని విద్యాశాఖలో పలువురు అధికారులు, ఉద్యోగులు బదిలీ అయ్యారు. సాధారణ బదిలీల్లో భాగంగా విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల పరిధిలోని అధికారులు, ఉద్యోగుల్లో దీర్ఘకాలంగా పనిచేస్తున్న వారికి స్థానచలనం కల్పించారు. విశాఖ డీఈవో కార్యాలయంలోని సూపరింటెండెంట్ జగన్నాథంను అనకాపల్లి జిల్లా సమగ్ర శిక్ష కార్యాలయానికి బదిలీ చేశారు. అక్కడ పనిచేస్తున్న సుందర్‌సింగ్ విశాఖకు బదిలీ అయ్యారు.

13 మంది 'అప్పన్న' ఉద్యోగులకు స్థానచలనం

సింహాచలం: సింహాచలం దేవస్థానంలో 13 మంది ఉద్యోగులకు బదిలీ అయింది. దేవస్థానంలో ఏఈవోలుగా పనిచేస్తున్న ఎస్.ఆనంద్‌కుమార్, ఇజిరోతు శ్రీనివాసరావును అన్నవరం దేవస్థానానికి, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న సుంకర తాతాజీని విజయవాడ దేవస్థానానికి స్థానచలనం జరిగింది. సూపరింటెండెంట్లు పద్మనాభరాజు, పిల్లా శ్రీనివాసరావు, అప్పలనాయుడు, రాజ్య లక్ష్మి, గోపీనాథ్‌కు అన్నవరం దేవస్థానానికి, సూపరింటెండెంట్ జి.వి.ఎస్.కె.ప్రసాద్‌కి కనకమహాలక్ష్మి దేవస్థానానికి బదిలీ అయింది. ముగ్గురు సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్ బదిలీ అయ్యారు.

వైభవ వేంకటేశ్వరస్వామి ఈవోగా ప్రసాద్

విశాఖలోని వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయ ఈవోగా బండారు ప్రసాద్‌ను కొనసాగిస్తూ సంగివలస పోలమాంబ అలియాస్ కొత్తమ్మవారి ఆలయ ఈవోగా నియమించారు. మునగపాకలోని శ్రీ పాలేశ్వర, భీమేశ్వరాలయం ఈవో పి.ఎస్.నారాయణమూర్తికి ఆ ఆలయం బాధ్యతలు కొనసాగిస్తూ.. విశాఖ అయ్యప్పనగర్‌లోని భూ సమేత వేంకటేశ్వర స్వామి దేవస్థానానికి రెగ్యులర్ ఈవోగా నియమించారు. గరుడ సత్రం ఈవో హైమావతిని జైన్ సత్రానికి బదిలీ చేశారు. ఇసుకకొండ సత్యనారాయణ స్వామి ఈవో బి.ఎల్.నగేష్‌కు గరుడ సత్రం బాధ్యతలు అప్పగించారు. వినాయకనగర్‌లోని విశాలాక్షి విశ్వేశ్వరస్వామి ఆలయ ఈవో అల్లు జగన్నాథరావును ఆ బాధ్యతల్లో కొనసాగిస్తూ భీమిలిలోని చిన్న సన్యాసయ్యసత్రం ఈవోగా బదిలీ చేశారు.

జీవీఎంసీ చీఫ్ సిటీ ప్లానర్‌గా సునీత



డాబాగార్డెన్స్: జీవీఎంసీ ప్రధాన పట్టణ ప్రణాళికాధికారిగా సునీత నియమితులయ్యారు. డీటీసీపీ(డైరెక్టర్ టౌన్ అండ్ ప్లానింగ్)లో అదనపు సంచాలకులుగా పనిచేస్తున్న సునీత.. గతంలో డీసీపీగా కూడా పనిచేశారు. ఇప్పటివరకు సీసీపీగా విధులు నిర్వర్తించిన సురేష్‌కుమార్‌ను సీఆర్‌డీఏ(అమరావతి)కి బదిలీ చేశారు. సురేష్‌కుమార్ నెల రోజుల పాటు సెలవుపై వెళ్లినప్పుడు సునీత ఇన్‌చార్జిగా ఉన్నారు.

ప్రాజెక్ట్ అధికారిగా సన్యాసినాయుడు

పార్వతీపురం కో–ఆపరేటివ్ అధికారి బి.సన్యాసినాయుడును జీవీఎంసీ యూసీడీ ప్రాజెక్ట్ అధికారిగా ప్రభుత్వం నియమించింది. సన్యాసినాయుడు గతంలో జీవీఎంసీ కార్యదర్శిగా, జోనల్ కమిషనర్‌గా విధులు నిర్వర్తించారు.

వీఎంఆర్‌డీఏ చీఫ్ అర్బన్ ప్లానర్‌గా సంజయ్

దొండపర్తి(విశాఖ దక్షిణ): వీఎంఆర్‌డీఏ చీఫ్ అర్బన్ ప్లానర్‌గా కె.సంజయ్ రత్నకుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటివరకు ఇక్కడ సీయూపీగా విధులు నిర్వర్తిస్తున్న ఎ.ప్రభాకరరావును ఏపీసీఆర్‌డీఏ అడిషనల్ డైరెక్టర్‌గా, జగనన్న శాశ్వత భూహక్కు ప్రాజెక్టు పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించారు. ఆయన స్థానంలో జీవీఎంసీలో డిప్యూటీ సిటీప్లానర్‌గా ఉన్న సంజయ్‌రత్నకుమార్‌ను సీయూపీగా నియమించారు.

పెందుర్తి ఎంపీడీవోగా వసంత

మహారాణిపేట : పెందుర్తి ఎంపీడీవోగా ఎస్.రాయవరంలో ఏవోగా పనిచేస్తున్న కె.వసంతను నియమించారు. ఈ మేరకు జిల్లా పరిషత్ సీఈవో శ్రీరామ్మూర్తి ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల పది మంది జిల్లా పరిషత్ ఏవోలు, ఈవోపీఆర్‌డీవోలకు ప్రభుత్వం ఎంపీడీవోలుగా పదోన్నతులు కల్పించిన సంగతి తెలిసిందే.

రేపు తాగునీటి సరఫరాకు అంతరాయం



దాబాగార్డెన్స్: జీవీఎంసీ పరిధిలో పలు ప్రాంతాల్లో తాగునీటికి అంతరాయం ఏర్పడనుందని జీవీఎంసీ పర్యవేక్షక ఇంజనీర్ వేణుగోపాల్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జీవీఎంసీ టీఎస్సార్ ప్రాంగణంలో గల స్టోరేజ్ రిజర్వాయర్ శుభ్రపరచనున్న నేపథ్యంలో ఈ నెల 3న ఉదయం 10 నుంచి 4వ తేదీ మధ్యాహ్నం 1 గంట వరకు అంతరాయం ఏర్పడనుందని తెలిపారు.

- జోన్–1 పరిధి 9, 10, 11వ వార్డులోని మధురవాడ, పీఎం పాలెం, ఆరిలోవ సెక్టార్ 1 నుంచి 12 వరకు, చినగదిలి, పెదగదిలి, విశాలాక్షినగర్, రవీంద్రనగర్, బాలాజీనగర్, ఆదర్శనగర్, ఎస్ఐజీ నగర్, సుందర్ నగర్, డ్రైవర్స్ కాలనీ ఏరియాలు.
- జోన్–3 పరిధి 12 నుంచి 27వ వార్డుల్లోని చినవాల్తేర్, పెద వాల్తేర్, పాండురంగాపురం, రేసపువానిపాలెం, పిఠాపురం కాలనీ, పీతలవానిపాలెం, శివాజీపాలెం, మద్దిలపాలెం, చైతన్యనగర్, వినాయకనగర్, మంగాపురం కాలనీ, జాలారిపేట, ఆదర్శనగర్, వాసవానిపాలెం, ఎంవీపీ సెక్టార్–1 నుంచి 12 వరకు, సీతంపేట ఏరియా, అక్కయ్యపాలెం ఏరియా, లలితానగర్, శ్రీనివాస్‌నగర్, ఎన్జీవోస్ కాలనీ, చిన్నూరు, శ్రీనివాస్‌నగర్, నందగిరినగర్, నరసింహనగర్, గణేష్‌నగర్, నక్కవానిపాలెం, క్రాంతినగర్, గాంధీనగర్, సింహాద్రిపురం, లక్ష్మీ నరసింహ నగర్, ఓల్డ్ వెంకోజీపాలెం, దుర్గానగర్ ప్రాంతాలు.
- జోన్–4 పరిధి 28 నుంచి 39 వార్డుల్లో వెలంపేట, టౌన్ కొత్తరోడ్డు, మెయిన్ రోడ్డు, రంగిరీజువీధి డౌన్, మంతావారి వీధి, సున్నపు వీధి, రెల్లివీధి, జబ్బర్‌తోట, చిలకపేట, అల్లిపురం ప్రధాన రహదారి, నేరెళ్ల కోనేరు రోడ్డు, అమ్మవారి వీధి, కుమ్మరవీధి, కొబ్బరితోట, నేతాజీనగర్, అంబేడ్కర్ కాలనీ, జెండా చెట్టు డౌన్, కలెక్టర్ ఆఫీస్ రోడ్డు, దండుబజార్, జాలారిపేట, సాలిపేట, కేజీహెచ్, డాబాగార్డెన్స్ ప్రధాన రహదారి, జగదాంబ జంక్షన్ రోడ్డు, నీలమ్మ వేపచెట్టు పరిధి, పలు ప్రాంతాలు.
- జోన్–5 పరిధి 41 నుంచి 44 వార్డుల్లో గల రైల్వే న్యూకాలనీ, వేంకటేశ్వరకాలనీ, జ్ఞానాపురం, బాబూకాలనీ, సిరులవీధి, సెబాస్టియన్ కాలనీ, జీఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీ, సుబ్బలక్ష్మినగర్, తాటిచెట్లపాలెం, పోర్టు, అబిద్‌నగర్, గొల్లలపాలెం, శ్రీనివాసనగర్, చెక్కుడురాయి బిల్డింగ్, దాడి రామ్మూర్తి కల్యాణ మండపం, చాకలిపేట, టీఎస్ఎన్ కాలనీ తదితర ప్రాంతాలు.

'జూనియర్' సందడి..!

- తెరుచుకున్న జూనియర్ కాలేజీలు
- ఇంటర్మీడియట్ తరగతులు ప్రారంభం
- ప్రభుత్వ కాలేజీల్లో అడ్మిషన్లు జోరు
- 'నాడు – నేడు'తో మెరుగైన వసతులు

విశాఖ విద్య: ఉమ్మడి విశాఖ జిల్లాలో జూనియర్ కాలేజీలు గురువారం తెరుచుకున్నాయి. వేసవి సెలవులు ముగియడంతో విద్యార్థులు కాలేజీల బాట పట్టారు. తొలిరోజు కాలేజీల్లో అడ్మిషన్ల సందడి కనిపించింది. సప్లిమెంటరీ పరీక్షలు గురువారంతో ముగియడంతో శుక్రవారం నుంచి తరగతులను సైతం ప్రారంభించేందుకు కాలేజీల నిర్వాహకులు సిద్ధమయ్యారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ, ప్రైవేటు కాలేజీల్లో 2023 – 24 విద్యా సంవత్సరానికి అడ్మిషన్లు ఊపందుకున్నాయి. ఇంటర్మీడియట్ చదువుల ప్రాధాన్యత దృష్ట్యా వార్షిక విద్యా క్యాలెండర్‌ను ప్రభుత్వం ఈ సారి ముందుగానే ప్రకటించింది. జూనియర్ కాలేజీల్లో చదువులు సవ్యంగా సాగేలా ఇంటర్మీడియట్ బోర్డు ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. వార్షిక విద్యా క్యాలెండర్ పక్కాగా అమలుపై ఫోకస్ పెట్టారు.

ఉమ్మడి జిల్లాలో ఇలా..

విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో ప్రభుత్వ జూనియర్ కాలేజీలు 39 ఉన్నాయి. సోషల్ వెల్ఫేర్ – 11, ట్రైబల్ వెల్ఫేర్ – 10, కేజీబీవీ – 34, బీసీ వెల్ఫేర్ – 2 మోడల్ జూనియర్ కాలేజీలు – 5, హైస్కూల్ ప్లస్ 2 – 10, ప్రైవేటు యాజమాన్యాల పరిధిలో 271 కాలేజీలు ఉన్నాయి. వీటి పరిధిలో 2022 – 23 విద్యా సంవత్సరంలో మొదటి, రెండో సంవత్సరం విద్యార్థులు కలిపి 92,895 మంది విద్యనభ్యసించారు. ఈ ఏడాది మొదటి సంవత్సరంలో 50 వేలకు పైగానే ప్రవేశాలు పొందే అవకాశం ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. ఇందుకు అనుగుణంగా కాలేజీల్లో అడ్మిషన్లపై ఫోకస్ పెట్టారు.



అడ్మిషన్ల కోసం కాలేజీకి వచ్చిన విద్యార్థినులు

పక్కాగా విద్యా క్యాలెండర్

2023 – 24 విద్యా సంవత్సరంలో 227 రోజులు కాలేజీలు పనిచేసేలా వార్షిక విద్యా క్యాలెండర్‌ను ఇంటర్మీడియట్ బోర్డు అధికారులు ప్రకటించారు. ఈ మేరకు గురువారం నుంచి జూనియర్ కాలేజీలు తెరుచుకున్నాయి. విద్యా క్యాలెండర్ మేరకు తరగతుల నిర్వహణపై దృష్టి సారించారు. ఇందులో భాగంగా జూలై 26 నుంచి 28 వరకు ఫస్ట్ యూనిట్, ఆగస్టు 24 నుంచి 26 వరకు సెకండ్ యూనిట్ పరీక్షలు నిర్వహించనున్నారు. క్వార్టర్లీ సెప్టెంబర్ 16 నుంచి 23 వరకు, మూడో యూనిట్ పరీక్షలు అక్టోబర్ 16 నుంచి 18 వరకు జరగనున్నాయి. దసరా సెలవులు అక్టోబర్ 19 నుంచి 25 వరకు ఇవ్వనున్నారు. నాలుగో యూనిట్ పరీక్షలు నవంబర్ 23 నుంచి 25 వరకు, హాఫ్ ఇయర్లీ పరీక్షలు డిసెంబర్ 18 నుంచి 23 వరకు ఉంటాయి. సంక్రాంతి సెలవులు 2024 జనవరి 11 నుంచి 17 వరకు ఇస్తారు. ప్రీ ఫైనల్ జనవరి 19 నుంచి 25 వరకు, వార్షిక పరీక్షలు మార్చి మొదటి వారంలో నిర్వహించేలా విద్యా క్యాలెండర్‌ను ప్రకటించారు.

అమ్మ ఒడితో ఉన్నత చదువులవైపు

ఇంటర్మీడియట్ విద్యార్థులకు సైతం అమ్మ ఒడి పథకం కింద అర్హులైన వారికి ఏడాదికి రూ.15 వేలు ప్రభుత్వం అందిస్తుండడంతో పేద విద్యార్థులు సైతం ఉన్నత చదువుల వైపు వస్తున్నారు. జిల్లాలో 2022 – 23 విద్యా సంవత్సరానికి 25,945 మంది విద్యార్థులకు అమ్మ ఒడి పథకం కింద రూ. 38.92 కోట్లు మంజూరయ్యాయి. ప్రభుత్వ జూనియర్ కాలేజీలను బలోపేతం చేసే క్రమంలో 'నాడు – నేడు' కింద మౌలిక వసతుల కల్పనకు నిధులు కేటాయించగా, వీటితో చేపట్టిన పనులు తుదిదశకు చేరుకున్నాయి. దీంతో విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలూ సమకూరనున్నాయి.

అడ్మిషన్ల పెంపుపై ప్రత్యేక దృష్టి



2023 – 24 విద్యా క్యాలెండర్ ప్రకారం గురువారం నుంచి జూనియర్ కాలేజీల్లో తరగతులు ప్రారంభమయ్యాయి. సప్లిమెంటరీ పరీక్షలు గురువారంతో ముగిశాయి. స్పాట్ వాల్యూవేషన్ కూడా పది రోజుల్లో పూర్తి చేసేలా శ్రద్ధ తీసుకుంటున్నాం. ఉన్నతాధికారుల ఆదేశాలకు అనుగుణంగా ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో అడ్మిషన్ల పెంపునకు కృషి చేస్తున్నాం.

– పి.ఉమారాణి, ఆర్ఐవో, ఉమ్మడి విశాఖ జిల్లా

సింహగిరిపై తలనీలాల టికెట్ ధర రూ. 40

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో కేశఖండనశాల టికెట్ ధర రూ.40కి పెంచుతున్నట్టు దేవస్థానం ఈవో వి.త్రినాథరావు తెలిపారు. ప్రస్తుతం తలనీలాల టికెట్ ధర రూ.25 ఉందని, పెంచిన ధర రూ.40 శుక్రవారం నుంచి అమల్లోకి రానుందని పేర్కొన్నారు. భక్తులు ఈ విషయాన్ని గమనించాలని సూచించారు.

పల్లవికి వెయిట్‌లిఫ్టింగ్‌లో స్వర్ణం



పల్లవి

విశాఖ స్పోర్ట్స్: ఖేలో ఇండియా వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో నగర వెయిట్ లిఫ్టర్ ఎస్.పల్లవి స్వర్ణాన్నందుకుంది. ఉత్తరప్రదేశ్‌లోని నోయిడాలో జరిగిన ఈ పోటీల్లో పల్లవి 64 కేజీల వెయిట్ కేటగిరిలో పాల్గొని విజేతగా నిలిచింది. ఈ సందర్భంగా పల్లవిని ఏయూపీఈ విభాగపు హెడ్ ఎ.పల్లవి, వెయిట్‌లిఫ్టింగ్ సంఘ ప్రతినిధి కె.సూర్యనారాయణ, శ్రీనివాసరావు, రాము తదితరులు అభినందించారు.

మంత్రి చెల్లుబోయిన రాక నేడు

మహారాణిపేట: రాష్ట్ర బీసీ సంక్షేమ, ఐ అండ్ పీఆర్ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాల కృష్ణ శుక్రవారం విశాఖ రానున్నారు. ఉదయం 10.05 గంటలకు తిరుపతి నుంచి విమానంలో విశాఖ చేరుకుంటారు. అక్కడి నుంచి నేరుగా నొవొటెల్ హోటల్‌కు చేరుకుని బస చేస్తారు. అనంతరం స్థానికంగా ఏర్పాటు చేసిన పలు కార్యక్రమాల్లో మంత్రి పాల్గొంటారని జిల్లా అధికారులు తెలిపారు.

రేపటి నుంచి ఏపీపీఎస్సీ పరీక్షలు



మాట్లాడుతున్న డీఆర్వో శ్రీనివాసమూర్తి

విశాఖ విద్య: జిల్లాలో ఈ నెల 3 నుంచి 10వ తేదీ వరకు జరగనున్న ఏపీపీఎస్సీ పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎస్.శ్రీనివాసమూర్తి అధికారులను ఆదేశించారు. పరీక్షల నిర్వహణపై గురువారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో ఆయన సమీక్షించారు. ఏయూలో జరగనున్న ఈ పరీక్షలకు జిల్లాలో 1,283 మంది అభ్యర్థులు హాజరవుతారన్నారు. పరీక్ష సమయానికి 10 నిమిషాల ముందు మాత్రమే అభ్యర్థులను కేంద్రంలోకి అనుమతించాలన్నారు. అభ్యర్థులు తప్పనిసరిగా ఏదో ఒక గుర్తింపు కార్డు తీసుకురావాలన్నారు. మొబైల్ ఫోన్లు, స్మార్ట్ వాచీలు, డిజిటల్ పరికరాలు వంటివి అనుమతించరని తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయడంతోపాటు తాగునీటి సదుపాయం, ఆరోగ్య సిబ్బందిని అందుబాటులో ఉంచాలన్నారు. విద్యుత్ అంతరాయం కలగకుండా చూడాలని ఈపీడీసీఎల్ అధికారులను ఆదేశించారు. ఎస్డీసీ జె.వి.ఎస్.ఎస్.రామ్మోహన్‌రావు, ఎస్.వెంకటేశ్వర్లు, డీఎస్‌వో సూర్యప్రకాశరావు, ఏయూ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ కామర్స్ ప్రిన్సిపాల్ ఎ.నరసింహారావు, ఏపీపీఎస్సీ డిప్యూటీ సెక్రటరీ ప్రసూన, సెక్షన్ ఆఫీసర్లు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఫీజు బకాయి ఉందని పరీక్షలకు అనుమతించలేదు

- సాంకేతిక కళాశాల తీరుపై తల్లిదండ్రుల ఆగ్రహం

పీఎంపాలెం: ఫీజు బకాయి ఉందనే కారణంతో విద్యార్థులను పరీక్షలు రాసేందుకు సాంకేతిక పాలిటెక్నిక్ కళాశాల యాజమాన్యం అనుమతించలేదని తల్లిదండ్రులు ఆరోపించారు. దీంతో తమ పిల్లలు మనోవేదనకు గురయ్యారని, సుమారు అరగంట సమయం వృథా అయిందని ఆవేదన వ్యక్తం చేశారు. వివరాలివీ.. సాంకేతిక పాలిటెక్నిక్ కళాశాలలో బ్యాక్‌లాగ్ సబ్జెక్టుల పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ పరీక్షలు రాయడానికి గురువారం విద్యార్థులు కళాశాలకు చేరుకున్నారు. అయితే ఫీజు బకాయి ఉందన్న కారణంతో సుమారు 25 మంది విద్యార్థులను యాజమాన్యం కేంద్రానికి అనుమతించ లేదు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు యాజమాన్య తీరుపై ఆగ్రహం వ్యక్తం చేయడంతో.. చివరకు దిగి వచ్చింది. అప్పటికే సుమారు అర గంట విలువైన సమయాన్ని విద్యార్థులు కోల్పోయారు. ఈ సంఘటనపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని ఓ విద్యార్థి తండ్రి ఎస్.ఆదినారాయణ తెలిపారు. దీనిపై యాజమాన్యం వివరణ కోరగా.. ఫీజు చెల్లించాలని మాత్రమే విద్యార్థులను అడిగామని, అందరినీ పరీక్షలకు అనుమతించామని చెప్పారు.

రివెంజ్ మర్డర్

- రౌడీ షీటర్ క్రాంతి దారుణ హత్య
- గతంలో కొడుకు శ్యామ్‌తో కలిసి ఓ హత్యలో పాల్గొన్న వ్యక్తే నిందితుడు?
- ఆ హత్య కేసు అనంతరం పట్టించుకోలేదని కక్ష
- దానికి రివెంజ్‌గానే క్రాంతిని హత్య చేసినట్లు సమాచారం
- కత్తితో విచక్షణారహితంగా దాడిచేసి పరారైన దుండగులు





క్రాంతి మృతదేహం (ఇన్‌సెట్) క్రాంతి(ఫైల్)



మీడియాతో మాట్లాడుతున్న క్రాంతి భార్య, కొడుకు శ్యామ్



అనుమానితుడు ఎర్రయ్య

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీ పోలీస్ స్టేషన్ పరిధి ఆదర్శనగర్ ప్రాంతంలో గురువారం రాత్రి దారుణ హత్య జరిగింది. గుర్తుతెలియని వ్యక్తులు రౌడీషీటర్ వాసుపల్లి లక్ష్మణరావు అలియాస్ క్రాంతి (50)ని దారుణంగా హత్యచేశారు. ఈ ఘటనలో హత్యకు గురైన క్రాంతిపై గతంలో రెండు హత్య కేసులు నమోదై ఉన్నాయి. గత కొన్నాళ్లుగా అతడు వివాదాలకు దూరంగా ఉంటున్నట్లు కుటుంబ సభ్యులు వెల్లడించారు. ప్రస్తుతం నగరంలోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. గురువారం రాత్రి 7 గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వచ్చిన క్రాంతి అనుపమ బార్ ప్రాంగణంలో మద్యం సేవించాడు. అనంతరం అక్కడ చీకులు అమ్ముతున్న వ్యక్తితో కొద్దిసేపు మాట్లాడి సమీపంలో రోడ్డుకు అటువైపు ఉన్న మెడ్‌ప్లస్ మెడికల్ షాపు వద్ద మందులు కొనడానికి వెళ్లాడు. అప్పటికే అక్కడ కాపు కాసిన కొందరు గుర్తుతెలియని వ్యక్తులు మెడ్‌ప్లస్ షాపులోకి వెళుతున్న అతనిపై కత్తులతో దాడి చేశారు. మెడ, నుదిటి భాగంలో తీవ్రంగా నరకడంతో క్రాంతి అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. అనంతరం దండగులు అక్కడి నుంచి పరారయ్యారు.

కొడుకుతో కలిసి హత్యలో పాల్గొన్న వ్యక్తే ?

2022 ఆగస్టు 17న జరిగిన అదే ప్రాంతంలో జరిగిన ఓ హత్య ఘటనలో క్రాంతి కొడుకు శ్యామ్‌తో పాటు పాల్గొన్న ఎర్రయ్య అనే వ్యక్తే క్రాంతిని హతమార్చినట్లు సమాచారం. ఆ హత్య కేసులో క్రాంతి కొడుకు శ్యామ్ ఏ1 కాగా ఎర్రయ్య ఏ3 ముద్దాయిగా ఉన్నాడు. ఆ ఘటన అనంతరం క్రాంతి తన కొడుకు శ్యామ్ బెయిల్ కోసం, ఇతర అవసరాల కోసం తప్ప ఆ హత్యకు సహకరించిన తనని పట్టించుకోలేదనే కక్షతో కొన్నాళ్లుగా ఎర్రయ్య రగిలిపోతున్నట్లు తెలిసింది. ఈ నేపథ్యంలోనే వీరు ఇరువురు కొంతకాలంగా గొడవ పడుతున్నారు. అవకాశం కోసం ఎదురు చూసిన ఎర్రయ్య గురువారం మెడికల్ షాపునకు వచ్చిన క్రాంతిపై విచక్షణా రహితంగా దాడి చేసి హతమార్చినట్లు తెలిసింది. ఈ ఘటనలో అతనికి వేరే వ్యక్తులు కూడా సహకారం అందించినట్లు పలువురు చెబుతున్నారు.

క్రాంతిపై గతంలో కేసులు..

హత్యకు గురైన క్రాంతిపై నగరంలో రెండు హత్య కేసులు నమోదై ఉన్నాయి. పీఎం పాలెం పోలీసు స్టేషన్ పరిధిలోని ఓ హత్య కేసును కోర్టు కొట్టేయగా.. 2014లో 3వ పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో జరిగిన హత్య కేసు ఇంకా కోర్టులో నడుస్తోంది. ఈ ఘటన అనంతరం క్రాంతి భార్య విలేకరులతో మాట్లాడుతూ గత కొంతకాలంగా తన భర్తను హత్య చేసేందుకు కొందరు ప్రయత్నిస్తున్నట్లు వెల్లడించారు. ఈ విషయం ఆయనే పలుమార్లు తనకు చెప్పాడన్నారు. ఇందుకు అవసరమైన డబ్బులు వేరే వ్యక్తులు సమకూరుస్తున్నారన్నారు. ఎవరు హత్య చేశారనే విషయాన్ని పోలీసులు నిగ్గుతేల్చాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ హత్య నేపథ్యంలో క్రాంతి కొడుకుతో పాటు పలువురిని ముందస్తు భద్రతా చర్యల్లో భాగంగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

ప్రసాద్ స్కీమ్ పనుల బుక్‌లెట్ రూపకల్పన



బుక్‌లెట్ ఆవిష్కరిస్తున్న స్వరూపానందేంద్ర సరస్వతి స్వామీజీ

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి దేవస్థానంలో కేంద్ర ప్రభుత్వం ప్రసాద్ స్కీమ్ ద్వారా చేసే అభివృద్ధి పనుల జాబితాని దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యులు బుక్‌లెట్ రూపంలో పొందుపరిచారు. ఆ బుక్‌లెట్‌ని విశాఖ శ్రీ శారదాపీఠంలో పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి గురువారం ఆవిష్కరించారు. రూ.54.04 కోట్లతో దేవస్థానంలో జరగనున్న పలు అభివృద్ధి పనులకు సంబంధించి గత నెల 26 నుంచి ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ టెండర్ల ప్రక్రియకి శ్రీకారం చుట్టింది. ఆ పనులకి సంబంధించి పూర్తి అంశాలతో ట్రస్ట్‌బోర్డు సభ్యులు బుక్‌లెట్‌ని తయారు చేశారు. దాన్ని స్వామీజీ ఆవిష్కరించారు. దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యులు గంట్ల శ్రీనుబాబు, దొడ్డి రమణ, వారణాసి దినేష్‌రాజ్, సువ్వాడ శ్రీదేవి, పిల్లా కృష్ణమూర్తి పాత్రుడు పాల్గొన్నారు.

చందనోత్సవ నిర్వహణ వైఫల్యాలపై విచారణ



కప్ప స్తంభానికి మొక్కుకుంటున్న ఏడీసీ చంద్రకుమార్

సింహాచలం: వరాహ లక్ష్మీ నృసింహస్వామి చందనోత్సవం నిర్వహణలో చోటు చేసుకున్న వైఫల్యాలపై రాష్ట్ర దేవదాయ శాఖ అడిషనల్ కమిషనర్ చంద్రకుమార్ గురువారం విచారణ చేపట్టారు. ఏప్రిల్ 23న జరిగిన చందనోత్సవంలో రాజగోపురం ఎదురుగా గంటల తరబడి వీఐపీలు నిలబడటం, వారంతా తమకు దర్శనం కాలేదని నిరసన వ్యక్తం చేయడం, శారదాపీఠాధిపతి చందనోత్సవం నిర్వహణపై బహిరంగంగా విమర్శించడం, తర్వాత ఈ ఘటనపై కలెక్టర్ విచారణకు ఆదేశించడం, దేవస్థానం ఉద్యోగులను జేసీ తన కార్యాలయంలో విచారించడం తెలిసిందే. అలాగే దేవదాయశాఖ కూడా విచారణకు ఆదేశించి చంద్రకుమార్‌ను నెల రోజుల కిందటే నియమించింది. ఈ నేపథ్యంలో గురువారం ఆయన దేవస్థానానికి వచ్చి విచారణ చేపట్టారు. ఏయే ప్రాంతాల్లో లోటుపాట్లు జరిగాయో స్వయంగా పరిశీలించారు. కొన్ని రికార్డులను తనిఖీ చేశారు. దేవస్థానం ఈవోతో మాట్లాడారు. క్యూలు ఏ విధంగా ఏర్పాటు చేశారని ఇంజినీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆ రోజు ఆయా ప్రాంతాల్లో విధులు నిర్వర్తించిన దేవస్థానం ఉద్యోగులతో మాట్లాడారు. జిల్లా కలెక్టర్ మినిట్స్‌ను పరిశీలించారు. టికెట్లు ఎన్ని ముద్రించారు.? ఎన్ని విక్రయించారు? తదితర వివరాలు సేకరించారు. శుక్రవారం కూడా విచారణ కొనసాగనుంది. విచారణలో దేవదాయశాఖ డీసీ విజయ్‌రాజ్ ఉన్నారు. ఈ సందర్భంగా చంద్రకుమార్ స్వామిని దర్శించుకుని పూజలు నిర్వహించారు.

తుపాకీ తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న క్రైం డీసీపీ నాగన్న



శ్రీధర్‌ను కోర్టుకు తరలిస్తున్న కానిస్టేబుల్



తుపాకీ

సీతమ్మధార: మహారాష్ట్ర నుంచి ఒడిశాకు తుపాకీని తీసుకెళ్తున్న శ్రీధర్ హరికిషన్ పతాంగిని పోర్ట్‌టౌన్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. స్టేషన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో క్రైం డీసీపీ నాగన్న ఈ వివరాలు వెల్లడించారు. మహారాష్ట్రకు చెందిన శ్రీధర్ హరికిషన్.. సంపాదన తక్కువగా ఉండటంతో తన బావమరిదిని కలిసి ఏదైనా పని ఉంటే చెప్పమన్నాడు. ఆయన తన స్నేహితుడు జల్నా జిల్లాకు చెందిన దత్త పవర్‌కు ఈ విషయం చెప్పాడు. వెంటనే ఆయన్ని శ్రీధర్ కలిశాడు. పూరిలోని ఓ వ్యక్తికి తుపాకీ ఇస్తే రూ.30 వేలు ఇస్తామని బేరం కుదుర్చుకున్నాడు. అడ్వాన్స్‌గా రూ.10 వేలు శ్రీధర్‌కు ఇచ్చాడు. తుపాకీ అందించిన తర్వాత రూ.20 వేలు ఇచ్చేందుకు ఒప్పందం జరిగింది. దీంతో శ్రీధర్ పూరి జగన్నాథస్వామిని దర్శించుకునేందుకు వెళ్దామని ఐదుగురి స్నేహితులను బయలుదేరించాడు. సోమవారం ఉదయం జల్నా రైల్వేస్టేషన్ నుంచి బయలుదేరి.. మధ్యాహ్నం మూడు గంటలకు నాందేడ్‌కు చేరుకున్నారు. నాందేడ్ నుంచి విశాఖపట్నంకు నాగావళి ఎక్స్‌ప్రెస్‌లో మంగళవారం ఉదయం వచ్చారు. సాధారణ బోగీలో రావడంతో ఒకరోజు విశాఖలో విశ్రాంతి తీసుకుని బుధవారం పూరి వెళ్లేందుకు ప్లాన్ చేసుకున్నారు. రైల్వే న్యూకాలనీలోని ఓ లాడ్జీలో 101, 105 నంబర్లు ఉన్న గదులను బుక్ చేసుకున్నారు. కాగా.. సీపీ ఆదేశాల మేరకు రోజు వారి విధుల్లో భాగంగా ఎస్ఐలు ఖగేశ్వరరావు, వెంకటరావు మంగళవారం ఈ లాడ్జీని తనిఖీ చేశారు. ఈ క్రమంలో 105 నంబర్ గదిని పరిశీస్తుండగా.. ముగ్గురు అనుమానాస్పదంగా కనిపించారు. ఎక్కడకు వెళ్తున్నారని పోలీసులు అడగడంతో తడబడ్డారు. బ్యాగులు తనిఖీ చేయడంతో తుపాకీ బయటపడింది. మొత్తం ఆరుగురిని పోర్ట్‌టౌన్ స్టేషన్‌కు తరలించి విచారించడంతో అసలు విషయం బయటపడింది. తన స్నేహితుడు ఒడిశాలోని ఓ వ్యక్తికి తుపాకీ ఇవ్వాలని చెప్పడంతో బయలుదేరినట్లు శ్రీధర్ పోలీసుల వద్ద ఒప్పుకున్నాడు. మహారాష్ట్రలో శ్రీధర్‌కు తుపాకీ ఇచ్చిన దత్తపవర్ చిరునామా కనుగొన్న ఎస్ఐ వెంకటరావు బృందం.. అక్కడకు వెళ్లి మరింత సమాచారం సేకరించింది. తుపాకీ అమ్మిన వ్యక్తిని అదుపులోకి తీసుకుని నగరానికి తీసుకొస్తున్నారు. అయితే తుపాకీపై నంబర్ లేకపోవడం గమనార్హం. శ్రీధర్‌పై కేసు నమోదు చేసి గురువారం రిమాండ్‌కు తరలించారు. మిగిలిన ఐదుగురిని శుక్రవారం విడిచి పెట్టే అవకాశం ఉంది. సమావేశంలో తూర్పు ఏసీపీ మూర్తి, సీఐ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అమరావతిలో పేదలకు ఇళ్ల స్థలాలు భేష్



మాట్లాడుతున్న సోషల్ డెమోక్రటిక్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు మాదిగాని గురునాథం

దాబాగార్డెన్స్: సుప్రీంకోర్టు తీర్పుతో అమరావతిలో పేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయడం ప్రశంసనీయమని సోషల్ డెమోక్రటిక్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు మాదిగాని గురునాథం అన్నారు. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 977 రోజులుగా అమరావతిలో వికేంద్రీకరణ, 55 వేల ఇళ్ల పట్టాల సాధన, ఇంగ్లిష్ మీడియం, తదితర అంశాలపై 27 వేల గంటలు దీక్ష చేశామన్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో 6 జోన్లతో సీఆర్‌డీఏ చట్టం చేశారని గుర్తు చేశారు. అక్కడ ఐదు శాతం చొప్పున ఎస్సీ, ఎస్టీ, బీసీలకు స్థలాలు కేటాయించాల్సి ఉందన్నారు. సీఎం వైఎస్ జగన్ సర్కారు పేదలకు ఇళ్ల స్థలాల మంజూరుకు ముందుకు వస్తే ప్రతిపక్ష నేత చంద్రబాబు కోర్టు స్టే తేవడం దురదృష్టకరమన్నారు. రాష్ట్రంలో మూడు రాజధానుల ఏర్పాటుకు మద్దతిస్తున్నామని చెప్పారు. అమరావతిలో పార్టీలకతీతంగా ఉద్యమం చేస్తున్నామని, ఇళ్ల స్థలాల కోసం సుప్రీంకోర్టు అనుకూలంగా తీర్పు ఇవ్వడం హర్షణీయమన్నారు. విశాఖలో సెప్టెంబర్ నుంచి పాలన ప్రారంభం కానుండడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. పేదలకు కేటాయిస్తున్న ఇళ్ల స్థలాలను చంద్రబాబు శ్మశానంతో పోల్చడం దారుణమన్నారు. ఈ సమావేశంలో బహుజన పరిరక్షణ సమితి యువజన నాయకుడు లక్ష్మీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

సూట్‌కేసుల్లో గంజాయి తరలింపునకు యత్నం

కూర్మన్నపాలెం(గాజువాక): రెండు సూట్‌కేసుల్లో పెట్టి అక్రమంగా గంజాయి తరలిస్తున్న ఇద్దరిని దువ్వాడ పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలిలా ఉన్నాయి. పశ్చిమ బెంగాల్‌కు చెందిన ఇమ్రాన్ అలీ(27), ఉత్తరప్రదేశ్‌కు చెందిన అబ్దుల్ జబ్బీర్(33) గత నెల 20న గంజాయి కోసం విశాఖపట్నానికి వచ్చారు. నగరానికి చెందిన ఓ వ్యక్తి వద్ద నుంచి 15 కేజీల గంజాయి కొనుగోలు చేశారు. ఇందుకు రూ.30 వేలు చెల్లించారు. ఎవరికీ అనుమానం రాకుండా రెండు సూట్‌కేసుల్లో గంజాయి అమర్చి తరలించేందుకు ప్రయత్నించారు. పక్కా సమాచారం మేరకు దువ్వాడ పోలీసులు కూర్మన్నపాలెం వద్ద తనిఖీ నిర్వహించారు. కూర్మన్నపాలెం బస్ డిపో వద్ద నిందితులు అనుమానాస్పదంగా తిరుగుతూ దువ్వాడ రైల్వే స్టేషన్‌కు వెళ్లేందుకు ఆటోలను ఆపుతున్నారు. ఈ క్రమంలో పోలీసులను చూసి సూట్‌కేసులను అక్కడ వదిలి పారిపోయేందుకు ప్రయత్నించారు. దువ్వాడ పోలీసులు అప్రమత్తమై వెంబడించి మరీ నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 15 కేజీల గంజాయి, రెండు సెల్‌ఫోన్‌లు, రూ.1200 నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్‌కు తరలించారు.